# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 351, నిజ భక్తులపై ప్రభావం లేదు
**ఫిబ్రవరి 27, 2025**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి *Seeking Within,* పేజీలు *116-120* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: స్వామి ఇప్పుడు భౌతిక శరీరంలో లేరు కనుక జీవించి ఉన్న గురువు ఎవరు? జీవించి ఉన్న గురువు అవసరమా?

జ. ప్రొ. అనిల్ కుమార్: గురువుకి జనన మరణములు ఉండవు! ఉపాధ్యాయులు వస్తుంటారు, పోతుంటారు, కానీ గురువుకి జనన మరణములు ఉండవు. షిరిడి భగవాన్ జగద్గురు. షిరిడి భగవాన్ సద్గురు. ఆయన ఏమన్నారు? ఆయన ఎముకలు మాట్లాడతాయి అన్నారు. ఆయన సమాధి మాట్లాడుతుంది అన్నారు! షిరిడిలో అడుగు పెట్టగానే మీ సమస్యలన్నీ మాయమౌతాయి.

బాబా ఏమన్నారు? "పుట్టపర్తి భూలోక స్వర్గం" అన్నారు. అదీ బాబా అన్న మాట! "మీరు ఇక్కడ అడుగు పెట్టిన తక్షణమే మీ బాధలు, కన్నీళ్లు తుడిచివేస్తాను! ఆ తర్వాత మీవన్నీ ఆనందభాష్పాలే! మీ సమస్యలన్నీ నా పాదాల దగ్గర వదిలేయండి! ఆనందం నింపుకొని వెళ్ళండి!" అన్నారు బాబా. బాబా వదిలి వెళ్ళిపోలేదు, ఎందుకంటే ఆయన రాలేదు కనుక. ఆయన ఎల్లవేళలా ఉంటారు!

ఆది మధ్యంత రహితుడు
అనాది వాడు
తాను చావక చంపబడక
అంతటా అలరునట్టి
అంతటా అలరునట్టి
సర్వ సాక్షి
ఆది మధ్యంత రహితుడు

సద్గురు సత్, చిత్
సద్గురు నిత్యసత్యమైనవాడు.

ప్ర: సాయి బాబా మహా సమాధి చెందిన తర్వాత సాయి భక్తులపై, సాయి సంస్థలపై ఉన్న ప్రభావం ఏమిటి?

జ. ప్రో. అనిల్ కుమార్: మీ ప్రశ్నలోనే తప్పు ఉంది. “బాబా మహా సమాధి చెందారు,” అన్నారు, అది తప్పు! సమాధి అనేది ఇంద్రియాతీతమైన స్థితి. అంటే ధ్యానం వంటి సాధనలు సల్పినప్పుడు ఎవరైనా ఈ సమాధి స్థితిని అనుభవించవచ్చు. బాబా సమాధి స్థితి చెందారు అనడం తప్పు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ ఆ స్థితిలోనే ఉంటారు. ఎప్పుడూ స్థిరంగా ఉంటారు. ఎప్పుడు స్థితప్రజ్ఞతలో ఉంటారు. ఎప్పుడూ ఇంద్రియాతీతులై ఉంటారు. కనుక ఆయన సమాధి స్థితి చెందలేదు.

ఇక మీ రెండవ ప్రశ్న సాయి భక్తులపై, సాయి సంస్థపై ప్రభావం. నా ఉద్దేశంలో సాయి భక్తుల భక్తిపై ప్రభావం కొత్తదేమీ కాదు. ప్రపంచమంతటా సాయి భక్తులు ఎన్నో మహిమలు అనుభవిస్తున్నారు. ఎవరికైనా సందేహాలుంటే నా దగ్గర ఎన్నో రుజువులు, చిరునామాలు ఉన్నాయి. కనుక నిజమైన భక్తులపై ఏ ప్రభావం లేదు.

మధ్యంతరంగా ఉన్న వారు - అంటే సాయి గురించి, ఆయన ఉపదేశం గురించి తెలియని వారు ప్రభావితులౌతారు. వారిపై ప్రభావం ఉంటే మంచిదే. ఇప్పుడు వారి గతి ఏంటో తెలుస్తుంది. అయితే ఆయనను అనుసరిస్తారు, లేకుంటే అనిశ్చితంగా మిగిలిపోతారు. ఇటువంటి వారు అన్ని రంగాలలో ఉంటారు, ప్రత్యేకంగా రాజకీయాలలో. అనగా మతంలో రాజకీయులైనవారు స్వార్థం, స్వప్రయోజనం చూసుకొనే వారిపై ఇటువంటి సమయాలలో సహజంగానే ప్రభావం ఉంటుంది. బాబా భౌతిక శరీరంలో లేకపోవడం వల్ల వారు ప్రభావితులౌతారు. కానీ నిజమైన భక్తుల గుణం ఇది కాదు అని నాకు తెలుసు.

నా ఉద్దేశం ఇది: ఏమైనా కానీ, నేను ఈ మార్గం ఎంచుకున్నాను. ఎక్కడికి పిలిస్తే అక్కడికి పోవడానికి నేను వాద్యబృందంలో సభ్యుడిని కాదు. నేను అలంటి వాడిని కాదు. నేను పట్టిన పట్టును విడువను. ఏమైనా కానీ, దేని కోసం ఆశించడం లేదు కనుక మనం పోగొట్టుకొనేది కూడా ఏమి లేదు. మన మతం, మన భక్తి స్వప్రయోజనం కొరకు, పేరు ప్రఖ్యాతుల కొరకు కాదు కనుక మనపై ప్రభావం ఉండదు. అదీ నా జవాబు.

**ప్ర: ప్రో. అనిల్ కుమార్, స్వామిని ఆఖరి సారి చూడలేక బాధ పడుతున్న వారికి ఏమి సలహా ఇస్తారు - 2010లో యాత్రకి వెళ్ళలేక స్వామి వెళ్ళిపోయే ముందు చూడలేని వారికి?**

జ. ప్రో. అనిల్ కుమార్: అటువంటి వారు మూడు తరగతులలో ఉన్నారని చెప్పవచ్చు. మొదటి తరగతి, స్వామిని ఎప్పుడూ చూడని వారు. రెండవ తరగతి, స్వామిని చూసారు కానీ 2010లో చూడని వారు. మూడవ తరగతి వారు స్వామితో ఎన్నో దశాబ్దాల నుండి దగ్గరగా ఉన్నవారు. దైవత్వముపై వారి అవగాహన బట్టి ఈ మూడు తరగతులు ఉన్నాయి. కానీ ఎన్ని ఏళ్ళు దగ్గరగా ఉన్నారు అనేది లెక్క కాదు. ఉద్యోగంలో లాగ కాదు - వయసు, పెద్దరికం లెక్కలోకి రావు.

మన భావం, దైవ భక్తి, ప్రేమ ముఖ్యం. ఎన్ని ఏళ్ళు దగ్గర ఉండడం ముఖ్యం కాదు. చిన్న ఉదాహరణ. మనం రాముడిని ఎప్పుడూ కలవలేదు. మీరు ఎప్పుడైనా రాముడిని కలిసారా? లేదనుకుంటా. కానీ మనం ఆయనను ప్రేమిస్తాం, పూజిస్తాం. మనం కృష్ణుడిని కూడా ఎప్పుడూ కలవలేదు కానీ ఆయన విగ్రహానికి పూజ చేస్తాం. మనం వెంకటేశ్వర స్వామి, షిరిడి బాబాను కూడా ప్రేమిస్తాం, ఆరాధిస్తాం, కానీ వారిని కూడా ఎప్పుడూ కలవలేదు. కనుక మనకు దేవునిపై ఉన్న భావం, గౌరవం, భక్తి, ప్రేమ ముఖ్యం, ఏళ్ళు కాదు.

**ప్ర: స్వామిని ఎప్పుడూ చూడని వారిని, స్వామిని చివరలో చూడని వారిని ఓదార్చడానికి ఏమైనా చెప్పండి.**

జ. ప్రొ. అనిల్ కుమార్: ఆయనను చూసిన వారు ఆయన ఆశయాలు నెరవేర్చడానికి ప్రయత్నించాలి! ఆయనతో ఎన్నో ఏళ్ళు ఉన్నవారు, ఆయన ఆదర్శాలను పాటించకపోతే వ్యర్థమే! దివ్యమైన పెట్టుబడి వ్యర్థమైనట్టే! ఆయనను చూసి, ఆయనతో ఎన్నో ఏళ్ళు గడిపిన వారు కూడా ఆయన ఉపదేశాలను అనుసరించకపోతే అది మంచి ఆదర్శం కాదు. ఆయనను ఎప్పుడూ చూడక, తర్వాత వచ్చిన వారు, ఆయన చరిత్ర చదివి, ఆయన ఫోటోలు చూసి వచ్చిన వారు 'కొత్త సరుకు'. వారు కొత్త అనుభవాలు, కొత్త చైతన్యంతో మొదలు పెడతారు.

ప్ర: మీరు వాడిన పదాలు, 'దివ్యమైన పెట్టుబడి', 'కొత్త సరుకు' నాకు నచ్చాయి. చక్కగా వర్ణిస్తున్నాయి. ఇటాలియన్ సమాజం, ప్రపంచమంతా కూడా అనాథలం అయిపోయిన భావాన్ని ఎలా ఎదుర్కోవాలి? చాలా మంది ప్రశ్నలలో ఈ పదం వాడారు. వారు అనాథలు అయినట్లు భావిస్తున్నారు. వారిని ఓదార్చడానికి ఏమైనా చెప్పండి.

జ. ప్రొ. అనిల్ కుమార్: అనాథ అనేది సంసారంలోనే జరుగుతుంది. 'నా తండ్రిని కోల్పోయాను' లేక 'నా తల్లిని కోల్పోయాను'. క్రమక్రమంగా ఆ భావాన్ని అధిగమించవచ్చు. కొన్నాళ్ళ తర్వాత ఆ అనాథ సమాజంలో యోగ్యుడైన కొడుకుగా తయారౌతాడు. "నా తల్లితండ్రులకు, నా కుటుంబానికి మంచి పేరు తేవాలి," అని నిశ్చయించుకుంటాడు. అదే విధంగా, ఏడ్చి, అనాథలం అయిపోయామని బాధపడే కంటే, బాబా వారి యోగ్యులైన భక్తులుగా జీవించవచ్చు. అప్పుడు సమాజమంతా మిమ్మల్ని చూసి, "బాబా వారి అద్భుతమైన భక్తులు వీరు! బాబా వారి జీవితాలపై ఎటువంటి ప్రభావం చేసారో!" అనుకొనే స్థితికి రావాలి.

వచ్చే సంసర్గంలో ప్రొ. అనిల్ కుమార్ మన అవగాహన, వివేకం మరి కొంత అభివృద్ధి పడుటకు సహకరిస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్